# ఘన స్వాగతం పలుకుదాం..

- నేడు పాలమూరుకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు
- 25 వేల మందితో సమావేశం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వెల్లడి



నితిన్ నబీన్ సిన్హా



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు గా నూతనంగా ఎన్నికైన నితిన్ నబీన్ మొదటిసారి పాలమూరుకు రానున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలుకుదామని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బిజెపి జాతీయ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ ఎన్నికలపై దిశా నిర్దేశం చేయను న్నారు. బూత్ స్థాయి కార్యకర్తల నుంచి జిల్లా నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి దాదాపు 25వేల మంది కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఈ మేరకు బుధవారం జరగనున్న సమావేశ ఏర్పాట్లను మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజా రెడ్డి, బిజెపి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నాయకుడు పోతుగంటి భరత్ తదితరులు పరిశీలించారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు బిజెపి శ్రేణులు తరలిరావాలని కోరారు.

**పాలమూరు నుంచి శంఖారావం:** మున్సిపల్ ఎన్నికల శంఖారావం మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభం కానుందని ఎంపీ డీకే అరుణ తెలిపారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ లో 30కి పైగా స్థానాల్లో కార్పొరేటర్లను గెలిపించుకొని మేయర్ పీఠాన్ని చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు రాకతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నిండా ఉందని పేర్కొన్నారు. అదే ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్రం నిధులతోనే సాధ్యం అవుతుందని, క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట



## గుర్తుల కేటాయింపులో
# పొరపాట్లకు తావివ్వొద్దు



- నిబంధనల ప్రకారం అభ్యర్థులకు గుర్తులను కేటాయించాలి
- తెలుగు అక్షర క్రమం ఆధారంగానే అభ్యర్థుల క్రమ సంఖ్య ఉండేలా చూసుకోవాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

గుర్తుల విషయ సూచికను పరిశీలిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జాతీయ,రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులను అభ్యర్థుల పేర్లలోని తెలుగు అక్షరమాల క్రమానుసారంగా కేటాయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం నాగర్ కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా, వార్డుల వారీగా దాఖలైన నామినేషన్ల ఆధారంగా రూపొందించిన అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కలెక్టర్‌కు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థుల పేర్ల ఆధారంగా తెలుగు అక్షరమాల క్రమంలో తయారు చేసిన జాబితాలను, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వివిధ రాజకీయ పార్టీల తరపున, అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తుల కేటాయింపు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. -మిగతా4లో..

# శ్రీ జమ్ములమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమిన జరిగే నడిగడ్డ ఇలవేల్పు శ్రీ జమ్మిచేడు జమ్ములమ్మ తల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలలో రెండవ వారం అయిన మంగళవారం వివిధ రాష్ట్రాలను నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం అయిన శ్రీ జమ్ములమ్మ, పరశురామ స్వామి దేవాల యానికి ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి కాక కర్ణాటక, మహా రాష్ట్ర తదితర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి తమ మొక్కలను చెల్లించుకుంటారు.



భక్తులతో కిటకిట లాడుతున్న ఆలయ ప్రాంగణం

వివరాలు 2లో..

# భక్తిశ్రద్ధలతో ఊరలక్ష్మమ్మ జాతర



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో గ్రామదేవత ఊర లక్ష్మమ్మ జాతర వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి. ప్రతి సంవత్సరం రైతులు, గ్రామస్తులు జాతరను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. రైతులకు పంటలు బాగా రావాలని యాసంగి పంటలు పుష్కలంగా పండాలని, గ్రామంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు.

# వెల్లువెత్తిన అభిమానం..

- వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, లక్ష్మారెడ్డి అభిమానులు
- ఘనంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు
- 1296 మంది స్వచ్ఛందంగా రక్తదానం




జడ్చర్లలో గజమాలతో మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్
- కార్పొరేషన్ అభ్యర్థులకు బీఫామ్ అందజేత




కార్పొరేషన్ అభ్యర్థులకు బిఫామ్ అందజేస్తున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

# రంగంలోకి రెబల్స్..?

- మున్సిపల్ ఛైర్మన్ పీఠంపై త్రిముఖ పోటీ
- కాంగ్రెస్ అభ్యర్థుల బి ఫామ్‌ల సమర్పణలో స్పష్టత కరువు
- "చేయి" జార్చుకుంటున్న కాంగ్రెస్ ?
- జోరందుకుంటున్న "కారు"
- చాపకింద నీరులా వికసిస్తున్న కమలం




గద్వాల మున్సిపల్ కార్యాలయం

**గద్వాల ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలలో వార్డుల వారిగా కాంగ్రెస్ అభ్యర్థుల నియామకంపై వర్గపోరుతో పలు వార్డులలో కౌన్సిలర్ స్థానానికి కాంగ్రెస్ రెబల్స్ తయారయ్యారు.దీంతో పలు వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఓటర్లు సందిగ్ధంలో పడ్డారు.ఒకే వార్డులో కాంగ్రెస్ వర్గం వారు ఇద్దరు పోటీలో ఉండడంతో బిఆర్‌యస్ పార్టీ గెలుపు వైపు దూసుకుపోతుంది.ఇప్పటికే సరిత వర్గంలో వున్న నలుగురు గెలుపు గుర్రాలు గులాబీ గూటికి చేరాయి.కొన్ని వార్డుల్లో కాంగ్రెస్ రెబల్స్ వుండే పరిస్థితులు ఉండడంతో బిఆర్‌యస్‌కు ఎక్కువ స్థానాలు గెలుపొంది మున్సిపల్ చైర్మెన్ పీఠాన్ని దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదేవిదంగా పట్టణంలోని 37 వార్డుల్లో కాంగ్రెస్, బిఆర్‌యస్ పార్టీలు వారి వారి అభ్యర్థులపై లెక్కలు వేసుకుంటూ గెలుపు ప్రయత్నాలు చేస్తుండగా చాపకింద నీరులా బీజేపీ పార్టీ అభ్యర్థులు మున్సిపల్ చైర్మెన్ పీఠాన్ని దక్కించుకునేందుకు తమకు కావలసిన లెక్కలు వారు వేసుకుంటూ తటస్థంగా ముందుకు సాగుతున్నారు.గతంలో అక్కల సాయిబాబా బీజేపీ పార్టీ నుండి గద్వాల మున్సిపల్ కోటపై బీజేపీ జెండా ఎగరవేశారు. పట్టణంలోని బీజేపీ ఓటర్లు బలంగానే ఉండడంతో గద్వాలలో బీజేపీ విజటంయపై కౌన్సిలర్ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా సోమవారం రాత్రి వరకు ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, సరిత తిరుపతయ్యల మధ్య వర్గపోరు ను సద్దుమనిచేందుకు ఎఐసిసి ఇంచార్జీ కార్యదర్శి మీనాక్షినటరాజన్,మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డిలు చర్చలు జరిపిన ఎవరికి ఎన్ని టిక్కెట్లు ఇవ్వాలి అన్నదానిపై సరైన స్పష్టత రాలేదు. ఈ విషయంపై మీనాక్షినటరాజన్ సీరియస్‌గా స్పందించినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉపసంహరణ రోజు ఉదయం చర్చలు జరిపి హుటాహుటిన నిర్ణయాలు తీసుకొని ఎమ్మెల్యే వర్గానికి 30, సరిత తిరుపతయ్య వర్గానికి 7 బిఫామ్‌లు ఇస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బి ఫామ్ లను ఎన్నికల అధికారులకు సమర్పించేందుకు కాంగ్రెస్ పార్టీ డి సి సి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మున్సిపల్ కార్యాలయం కు వెళ్లారు. చివరకు ఉప సంహరణ టైం దాటాక కార్యాలయం నుండి బయటకు రాగా మీడియాతో మాట్లాడుతూ బి ఫామ్ ల సమర్పణలో ఎలాంటి ఇబ్బందులు లేవని, కాంగ్రెస్ పార్టీ నుండి నామినేషన్ దాఖలు చేసిన వారందరికీ సి ఫామ్ తో పనిలేకుండా 37 మంది అభ్యర్థుల బి ఫామ్ లను అధికారులకు సమర్పించమని తెలిపారు. ఇరు వర్గాలకు బి ఫామ్ లు ఇచ్చారని, మొదటగా ఎమ్మెల్యే వర్గానికి ఇచ్చి, మళ్ళీ సరిత వర్గానికి ఇచ్చారని ఇలా డబుల్ బిఫామ్‌లు ఇచ్చారని వచ్చిన సమాచారంపై మీడియా ప్రశ్నించగా దానిపై క్లారిటీలేదు, కమిటి డిసైడ్ చేసి ఎవరికి ఇవ్వాలో వారికి సి ఫామ్ అవసరం లేకుండా అందరికీ బిఫామ్‌లు సమర్పించినట్లు తెలిపారు. ఇచ్చామని తెలిపారు. నేను కన్వీనర్ ను మాత్రమే, మంత్రి వాకిటి శ్రీహరి అధిష్టానం మేరకు కావలసిన అభ్యర్థులకు బి ఫామ్‌లు అందజేసినట్లు తెలిపారు. సరిత వర్గానికి 7 మందికి కాంగ్రెస్ బి ఫామ్‌లు వస్తాయని వారు ఎవరుకూడా నామినేషన్ ఉపసంహరించుకోలేదు.కొంతమందికాంగ్రెస్ అభ్యర్థులవార్డులలో ఇద్దరిద్దరుగా డబుల్ బిఫామ్‌లను దాఖాలు చేసినట్లు సమాచారం.నామినేషన్ల ఉప సంహరణ టైం దాటిన తర్వాత నలుగురు అభ్యర్థులు ఉప సంహా రణకు రాగా వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. -మిగతా4లో..

# మున్సిపల్ ఎన్నికలపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష

- పొరపాట్లకు తావివ్వద్దు
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి3 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి తప్పులకు తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, తహసీల్దారులు, మండల ఎంపీడీవోలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 3.00 గంటల వరకు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించినఅభ్యర్థిత్వ ఉపసంహరణకు గడువు ముగుస్తుందని స్పష్టం చేశారు. ఉపసంహరణ ప్రక్రియ పూర్తైన అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను నమూనా-7 (ఫారం-7) లో నమోదు చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్‌నుసక్రమంగా రూపొందించాలని, నమూనా-7 తయారు చేసే సమయంలో అత్యంత జాగ్రత్త వహించాలని తెలిపారు. మొదట రాజకీయపార్టీల బీ-ఫారమ్‌లు ఆధారంగా ఆయా అభ్యర్థులకు సరైన గుర్తులు కేటాయించాలని, అనంతరం స్వతంత్ర అభ్యర్థులు కోరుకున్న విధంగా ఎన్నికలసంఘం నిబంధనల మేరకు వారికి గుర్తులు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శివేంద్ర ప్రతాప్, డిఆర్‌డిఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, మాస్టర్ శిక్షకులు బాలు యాదవ్, బైకాని నాగరాజు పాల్గొన్నారు.

# పుర పోరులో ప్రచారాల జోరు



వనపర్తి మున్సిపల్ కార్యాలయం



- కాంగ్రెస్ అభ్యర్థుల ఉత్కంఠకు తెర
- బీఫామ్ పొందిన అభ్యర్థులు ఉత్సాహంతో ప్రచారం
- జన సమూహంతో వార్డుల్లో విస్తృత పర్యటన
- గడప గడపకి వెళ్లి ఓటర్లతో మిలాఖత్

**వనపర్తి ప్రతినిధి. ఫిబ్రవరి3 ప్రభాతవార్త:** మునిసిపల్ ఎన్నికల కౌన్సిల్ అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు కావడంతో నిన్నటి వరకు ఒక లెక్క ఈరోజు నుంచి మరో లెక్క అన్నట్లుగా బిఫాం పొందిన అభ్యర్థులు జోరుగా ప్రచారాన్ని అందుకున్నారు. కౌన్సిల్ అభ్యర్థులు పూర్తిగా ప్రజా క్షేత్రం లోనే గడుపుతూ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ మద్దతుదారుల తరుపున ప్రచారాలను ముమ్మరం చేశాయి. అభ్యర్థులు నిత్యం ప్రజల మధ్యనే గడుపుతూవారి మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ తమను గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారో ఓటర్లకు వివరిస్తున్నారు.మైకులతో ప్రచారంనిర్వహించేందుకుఅభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లను చేసుకుంటువార్డుల్లో మందీమార్బలంతో నాయకులు, కార్య కర్తలు ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకుంటూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**కాంగ్రెస్ అభ్యర్థుల ఉత్కంఠకు తెర...**

వనపర్తి మున్సిపల్ వార్డు అభ్యర్థులను దాదాపు మూడు రోజుల ముందే అన్ని పార్టీలు ప్రకటించినప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీ కావడంతో సాధారణంగానే ఆశావహులు గణనీయంగా ఉంటారు కావున ఉపసంహరణల చివరి నిమిషాల వరకు ఉత్కంఠ కొనసాగింది. టికెట్ ఆశించి భంగపడిన ఆశావాహులను బుజ్జగించి చివరకు అభ్యర్థులను ఖరారు చేసి బీఫామ్ అందించారు.

**పోటా పోటీగా ప్రచారం...**

ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీల మద్దతున్న అ భ్యర్థులు పోటీ పడుతున్నారు. ఒకరికి మించి మరొకరు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆక ట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో దాదాపు 14 గంటల పాటు ప్రజల మధ్యగ డుపుతున్నారు. ఉదయం 6 గంటలకే ప్రజల్లోకి వెళుతున్న నాయకులు రాత్రి పదింటికి గాని ఇళ్లు చేరడం లేదు. మునిసిపల్ ఎన్నికలు ఈ నెల 11వ తేదీన జరు గనున్నాయి. ప్రచారానికి మరో వారం రోజులు మాత్ర మే గడువు ఉండటంతో ఆయా వార్డుల్లో అభ్యర్థులు ప్రచార హోరు పెంచారు.అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు ప్రజలతోనే కానిస్తున్నారు. ప్రధాన పార్టీల మద్దతున్న అభ్య ర్థుల నడుమ విపరీతమైన పోటీ ఉన్న కారణంగా గెలుపే లక్ష్యంగా ఎవరికి వారే ముమ్మర పోరాటం చేస్తున్నారు.

**కుటుంబ సమేతంగా మిలాఖత్...**

మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వారి కుటుంభాల సమేతంగా పాల్గొంటూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఇంటిల్లిపాది తలో దారిలో ఇంటింటికి వెళుతూఓటర్లతో మిలాఖత్ అవుతున్నారు. ప్రధాన పార్టీల నేతల కుటుంబ సభ్యులను ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని ప్రత్యేకంగా రప్పించు కోవడం ద్వారా ఎన్నికల ప్రచారం మరింతగా ముమ్మరం చేసే -మిగతా4లో..

# చెక్‌పోస్ట్ తనిఖీల్లో 7 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం



చెక్‌పోస్టు తనిఖీల్లో వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**నారాయణ పేట, ఫిబ్రవరి 3ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా .వినీత్ ఆదేశాల మేరకు పేట పట్టణంలోని ఎర్రమన్ను గుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఎఫ్ఎస్‌టీ బృందం, పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌కు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి యాదగిరి నుండి సికింద్రాబాద్‌కు తరలిస్తున్న సుమారు 7కేజీల వెండి ఆభరణాలను అధికారులు గుర్తించారు. వెండి ఆభరణాలకు సంబంధించిన తగు ఆధారాలు చూపించాలని కోరగా, సంబంధిత వ్యక్తి సరైన పత్రాలు సమర్పించలేక పోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించారు. ఈ తనిఖీల్లో పేట పట్టణానికి చెందిన యాదయ్య, రూరల్ కానిస్టేబుల్ ఆనంద్‌గౌడ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిఐశివ శంకర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పాల్గొన్నారు. స్వాధీనం చేసిన వెండి ఆభరణాలను రాత్రి 12:00 గంటల సమయంలో గ్రీవియన్స్ కమిటీకి అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

## మద్దూరు మున్సిపాలిటీ

## కేంద్రంలో అభ్యర్థులకు బి ఫామ్ అందజేత



అభ్యర్థులకు బి ఫామ్ అందజేస్తున్న కొడంగల్ నియోజకవర్గ ఇంఛార్జి ఎనుముల తిరుపతి రెడ్డి

**మద్దూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం కొడంగల్ నియోజకవర్గ ఇంఛార్జి ఎనుముల తిరుపతి రెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 16 మంది అభ్యర్థులకు బి ఫామ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తరఫున పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రజల మధ్యకు వెళ్లి కష్టపడి పనిచేసి విజయం సాధించాలని సూచించారు. ఎన్నికల పోరాటంలో కార్యకర్తలుఅభ్యర్థులకు అండగా నిలబడి ముందుండి పనిచేయాలని ఆయన కోరారు. పార్టీబలోపేతానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, క్రమశిక్షణతో ఎన్నికలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది భీములు, మాజీ పిఎస్ చైర్మన్ గూళ్ళ నర్సింహులు, శివరాజ్, నిడ్జింత తిరుపతిరెడ్డి, రఘుపతి రెడ్డి, వెంకట్రాములు గౌడ్, రమేష్ రెడ్డి, సంజీవులు, బాలయ్య, శ్రీనివాస్ రెడ్డి, రేణివట్ల గోవింద్, కొత్తూరు వెంకట్ రెడ్డి, జీడి ప్రకాష్, చందు, నరసింహులు గౌడ్, మున్సిపాలిటీ పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతరలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

**నారాయణపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఊట్కూర్ మండలంలోని ఊర లక్ష్మమ్మ జాతర సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు బాల్య వివాహాల దుష్పరిణామాలు, చైల్డ్ రక్షణ చట్టాలు, అలాగే పిల్లలపై ఉన్న మూఢనమ్మకాల గురించి వివరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న జాతరల సమయంలో కొందరు ఆర్థిక సమస్యలను కారణంగా చూపుతూ చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిపిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇలా బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు సమాచారం అందించాలని, న్యాయ సంబంధిత సమస్యలు ఉంటే 15100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్లు ఎస్. హాజమ్మ, వర్ష, కె.నారాయణ, అంజమ్మ, భాగ్య, శోభారాణి సర్పంచ్ రేణుక భారత్, మాజీ సర్పంచ్ లు ఎం.భాస్కర్, సూర్యప్రకాశ్ రెడ్డి, జి.నింగిరెడ్డి, మాజీ ఎంపిటిసి హన్మంతు, మాజీ ఉప సర్పంచ్ కె.గోపాల్, శివరాజ్ తదితరులు హాజరయ్యారు.




బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

## పేట అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

**మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి**

**నారాయణ పేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నారాయణ పేట పట్టణంలోని 2, 3వ వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. గత టిఆర్ఎస్ పాలన ఎలా ఉందో, ప్రస్తుతం రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు గమనించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను సుతరి అరుణ, రాంరెడ్డి, కాకర్ల నారాయణమ్మలకు మద్దతుగా నిలిచి గెలిపించాలని వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మళ్లీ మన అధికారంలోకి రాబోతున్నామని, ఓటర్లతో మాట్లాడుతూ భరోసా కల్పించారు. పేట రోడ్డు వైడెనింగ్, పార్కుల ఏర్పాటు, మెడికల్ కళాశాల, డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పరంగా సాధించిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సుదర్శన్ రెడ్డి, విజయ్ సాగర్, సలీం అద్దంకి, దేవరాజ్, జంగటి వెంకటేష్, పోషల్ సంతోష్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

## విద్యా వ్యతిరేక బడ్జెట్

**పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్**


**చిన్నచింతకుంట, ఫిబ్రవరి3 ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్న ఈ బడ్జెట్లో రూ. లక్ష 39 కోట్లను విద్యా రంగానికి కేటాయించారంటే 2.6% మాత్రమేనని ఆయన విమర్శించారు. ప్రతిసారి బడ్జెట్ లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ బడ్జెట్ కార్పోరేట్ అనుకూల బడ్జెట్ అన్నారు. పేదలకు విద్యను దూరం చేసేలా ఈ బడ్జెట్ కేటాయింపులు జరిపారని జాతీయ నూతన విద్యా విధానం ద్వారా జిడిపి 6% నిధులను కేటాయిస్తామని చెప్పినవారే నిధులు కేటాయించకపోవడం దారుణం అన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరి స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కాలర్షిప్ వంటి వాటికి కేటాయింపులు లేవన్నారు. విద్య అనేది సమానత్వం, ప్రజాస్వామ్యం బలపరిచే మూలాధారం. అలాంటి విద్యకు సరిపడా నిధులు కేటాయించకపోవడం విద్యను ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కాషాయీకరణ వైపు అడుగులు వేస్తున్నట్టు తెలుస్తుందన్నారు. విద్య రంగానికి కేటాయింపుల్లో సవరణ చేయకపోతే పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కర్ని విద్యార్థులు

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** జనవరి 18, 19 ,20 తేదీలలో బాల బాలికల ఖోఖో పోటీలలో, మక్తల్ మండలం జడ్‌పిహెచ్‌ఎస్ కర్ని విద్యార్థులు నారాయణపేట్ మినీ స్టేడియం గ్రౌండ్‌లో జరిగిన 35వ తెలంగాణ సబ్ జూనియర్ డి.అరవింద్, బి.రేవతి లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూప తెలిపారు. జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన కర్ని విద్యార్థులు అరవింద్, రేవతి ఈనెల 1 నుండి ఫిబ్రవరి 5 వరకు హర్యానా రాష్ట్రం కురుక్షేత్రంలో ప్రస్తుతము జరుగుతున్న 35వ ఖోఖో సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరఫున ఆడుతున్నారని బి.రూప హర్యానా రాష్ట్రం నుండి ఫోన్ ద్వారా విలేకరులకు సమాచారం ఇచ్చారు. బి. రూప తెలంగాణ రాష్ట్రం నుండి టెక్నికల్ అఫీషియల్ గా వెళ్లారు. జాతీయస్థాయి ఖోఖో క్రీడలకు ఎంపికైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూపను తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణమూర్తి, బి.గోపాలం, విలియం పాఠశాల జిహెచ్‌ఎం వెంకటయ్య , సర్పంచ్ రాధా దత్తు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**దేవరకద్ర, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ కార్మిక సంఘం టియుసిఐ పిలుపులో భాగంగా ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని మంగళవారం కౌకుంట్ల మండలంలోని హమాలి సంఘం ఆధ్వర్యంలో షాప్ యాజమాన్యాల అసోసియేషన్‌కి సమ్మె డిమాండ్‌నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పియుసిప జిల్లా కార్యదర్శి సాంబశివుడు, హమాలి సంఘం అధ్యక్షులు సంతోష్, బుచ్చన్న, లక్ష్మణ్, ఆంజనేయులు, పెంటన్న, నాగరాజు , మల్లన్న, మన్నెంకొండ, నరసింహులు, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

## శ్రీ జమ్ములమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

**భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్న ఆలయ అధికారులు**

**గద్వాల ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమిన జరిగే నడిగడ్డ ఇలవేల్పు శ్రీ జమ్మిచేడు జమ్ములమ్మ తల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలలో రెండవ వారం అయిన మంగళవారం వివిధ రాష్ట్రాలను నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం అయిన శ్రీ జమ్ములమ్మ, పరశురామ స్వామి దేవాలయానికి ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి కాక కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి తమ మొక్కలను చెల్లించుకుంటారు. మంచి జరిగిన కొంత మంది భక్తులు ప్రతియేట ఆనవాయితీగా అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకుని, కానుకలను సదివిస్తుంటారు. ఈ బ్రహ్మోత్సవాలలో అమ్మవారికి కానుకల రూపంలో బంగారు, వెండి, పట్టువస్త్రాలు, కిరీటాలు, వివిధ రకాలుగా కానుకలను సమర్పించి తమ మొక్కలను తీర్చుకుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఆర్. పురేందర్ తెలిపారు. వచ్చే భక్తుల వస్తువులు ఎలాంటి అపహరణకు గురి కాకుండా, ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా జమ్ములమ్మ భక్తుల వీక్షిస్తున్నట్లూ తెలిపారు.



భక్తులతో కిటకిట లాడుతున్న ఆలయ ప్రాంగణం



శ్రీ జమ్ములమ్మ అమ్మవారికి మొక్కలు చెల్లించుకుంటున్న భక్తులు



సి సి కెమరాలలో పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఈఓ పురేందర్

## వ్యవసాయం బాగుంటేనే సమాజం బాగుపడుతుంది

**బికెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్ల చంద్రయ్య**

**బిజినేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఈ దేశ రైతుకు వ్యవసాయమే జీవన విధానం రైతు బాగుంటేనే సాగు బాగుంటుంది అని భారతీయ భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్ల చంద్రయ్య పిలుపునిచ్చారు. ఖానాపూర్ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం భూమాత గోమాత పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సంఘటితంగా ఉండి తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలి అని కోరారు. రైతులు చిరుధాన్యాల పంటలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పంట పాపిడి పద్ధతులను అవలంబించి రైతన్న దిగుబడితోపాటు , ఆర్థిక స్థితిగతులను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోమాత యొక్క విశిష్టతను ప్రజలకు వివరించాలని, గోఆధారిత వ్యవసాయం పైన రైతులు మక్కువ పెంచుకొని వ్యవసాయం చేయాలని కోరారు. రైతులు అన్ని వేళలో సంఘటితంగా ఉంటూ తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలని తెలిపారు. రైతు మర్యాదను నిలబెట్టి, అన్నదాతల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందిర వెంకట్ రాములు గౌడ్, పతాంజలి యోగ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు వస్పరిశివుడు, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు గుద్దేటి ఆంజనేయులు, మధుబాబు , మంతటి బాలస్వామి, వెంకట్ రెడ్డి, సింహారెడ్డి, నవీన్ రెడ్డి, రామన్ గౌడ్, కొండల్ రెడ్డి , మాజీ సర్పంచ్ తిరుపతయ్య, ఆంజనేయులు యూసుఫ్ తదితరులు ఉన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బీకేఎస్ నాయకులు

## భక్తిశ్రద్ధలతో ఊర లక్ష్మమ్మ జాతర వైభవంగా నిర్వహణ

**నారాయణ పేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో గ్రామదేవత ఊర లక్ష్మమ్మ జాతర వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి. ప్రతి సంవత్సరం రైతులు, గ్రామస్తులు ఈ జాతరను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. రైతులకు పంటలు బాగా రావాలని యాసంగి పంటలు పుష్కలంగా పండాలని, గ్రామంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జాతరలో భాగంగా మహిళలు తలపై బోనాలతో డప్పు మేళాల నడుమ బోయిని అమ్మన్న ఇంటి నుంచి అమ్మవారి దేవాలయానికి బయలుదేరారు. గ్రామ పురవీధుల గుండా సాగిన బోనాల ఊరేగింపు బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. మహిళల పూనకం, యువకుల నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. కొందరు కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయం, టెంట్లు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా వివిధ రకాల దుకాణాలు వెలిశాయి డీజే ఆటపాటలతో నాయకులు, యువకులు నృత్యాలు చేస్తూ భక్తులను అలరించారు. ఉమ్మడి జిల్లా జోగిని వ్యతిరేక పోరాట సమితి హాజమ్మ డప్పు కొట్టి ఉత్సాహాన్ని నింపారు. ఆలయానికి ఉచితంగా కలర్లు అందజేసిన ఎం. రాహుల్, హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి శిష్యుడు పీవీ నరసింహా రెడ్డిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు బాల్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గరిడి నింగి రెడ్డి, సర్పంచ్ రేణుక భరత్, ఉప సర్పంచ్ రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు యగ్నేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్య ప్రకాష్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



## ఛలో ఢిల్లీ ధర్నాను విజయవంతం చేయాలి

**పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్**

**దేవరకద్ర, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న నిర్వహించే ఛలో ఢిల్లీ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలో మంగళవారం ఛలో ఢిల్లీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష ( టెట్)ను సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ( పిఆర్‌టియు టిఎస్ ), ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ ( ఎఐజె ఎసిటిఒ), ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎఐఎఫ్‌టిఒ) ల పిలుపు మేరకు ఈ నెల 5న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ధర్నా ప్రారంభమవుతుందని అన్నారు. ధర్నాను విజయవంతం చేసేందుకు గాను ఇప్పటికే ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి నేతృత్వంలోని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్‌లతో కూడిన బృందం ఢిల్లీకి చేరిందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు బుచ్చారెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయు లు ఢిల్లీ ధర్నాకు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఈ సందర్భంగా చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.మురళి ధర్, నాగేశ్వర్ రెడ్డి , మదన్ మోహన్ , బి.శ్రీనివాస్ రావు, కావలి సుజాత తదితరులు పాల్గొన్నారు.



ధర్నాకు సంబంధించిన ఛలో ఢిల్లీ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి : తహసీల్దార్

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని తహసిల్దార్ ఎల్లన్న తెలిపారు. మంగళవారం కురుమూర్తి గ్రామంలో సీఎం కప్ మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని బాలబాలికలు క్రీడల్లో రాణించేలా ఇప్పటినుంచే క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ క్రీడైన కబడ్డీలో చక్కటి ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలను సాధించాలని ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు తెలిపారు. ఈ క్రీడలు మానసికల్లాసాన్ని, ఐకమత్యాన్ని చాటుతాయని ఎంఈఓ మురళి కృష్ణ తెలిపారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో 9 జట్లు, బాలికల విభాగంలో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఈ కబడ్డీ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన బాలుర విభాగంలో కురుమూర్తి (ప్రథమ స్థానం) వడ్డేమాన్ (ద్వితీయ స్థానం) బాలికల విభాగంలో కేజీబీవీ, సీసీ కుంట (ప్రథమ) వడ్డేమాన్ (ద్వితీయ) స్థానాన్ని సాధించినట్లు కబడ్డీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కథలప్ప, గ్రామ సర్పంచ్ కురుమన్న, ఎస్సై ఓబుల్ రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేష్, వీరాంజనేయ యువజన సంఘం అధ్యక్షులు రాజు నాయుడు, మండల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, పిఈటిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్టుకు షీల్డ్ ను అందజేస్తున్న దృశ్యం

## మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ



మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** సిద్ధోటం గ్రామంలో ఎమ్మెన్నార్ ఈజీఎస్ నిధులతో మహిళా సమైక్య భవన నిర్మాణానికి జిల్లా పంచాయతీ రాజ్ ఏఈ కురుమూర్తి స్థానిక సర్పంచ్ మల్లేష్ గౌడ్ మహిళా సమాఖ్య సభ్యురాళ్ల సమక్షంలో శంకుస్థాపన చేయడం జరిగింది. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవతో మహిళా సంఘాల సభ్యురాళ్లకు మహిళా సమాఖ్య బిల్డింగ్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఎమ్మెన్నార్ ఈజీఎస్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లేష్ గౌడ్, డిప్యూటీ సర్పంచ్ సావిత్రి, గ్రామ ప్రజాప్రతినిధులు కాటమయ్య గౌడ్, రమేష్, మహిళా సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు



మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మాజీ మంత్రి చర్లకోట లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను నవాబుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల టిఆర్ఎస్ అధ్యక్షులు మాడమోని నరసింహులు, మండల టిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి టపాసులు పేల్చి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం జడ్చర్లలో బీఆర్ఎస్ కార్యకర్తలు రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్యాల రవీందర్ రెడ్డి, నర్సిములు. మాజీ ఎంపీపీ, శ్రీను, ప్రతాప్, తాహేర్, గోపాల్ గౌడ్, సర్పంచ్ లు రంజిత్ గౌడ్, రుద్రారం సర్పంచ్ రవీందర్, హనుమంతు ఎన్మన్‌గండ్ల ఆశన్న, జనార్ధన్, మెండే శ్రీను, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు

**క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎంఈఓ ప్రకాష్**



మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

**అడ్డాకుల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రభుత్వజూనియర్ కళాశాలలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ బుధవారం 4న నిర్వహిస్తున్నట్లు పీడిలుమంజుల, సుచేతన్ తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు సంబంధిత రిజిస్ట్రేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా తీసుకొని రావాలని తెలిపారు. క్రీడా ప్రాంగణాన్ని ఎంఈఓ ప్రకాష్ పరిశీలించారు. బుధవారం 4న జరుగుతున్న మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలకు క్రీడా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుండి విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనవచ్చని, ప్రతి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను రేపు జరిగే క్రీడా పోటీలకు ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా పీడీలను పంపించవలసిందిగా ఆయన సూచించారు. ఉదయం 8:30 నిమిషాలకు విద్యార్థులు జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని ఎంఈఓ తెలిపారు.


## పురపాలక ఎన్నికల్లో జనరల్ స్థానాలను బీసీలు కైవసం చేసుకోవాలి



సమావేశంలో బిసి నాయకులు ఐక్యత చాటుతున్న దృశ్యం

**మద్దూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** పురపాలక ఎన్నికల్లో బీసీలు జనరల్ స్థానాలను కైవసం చేసుకొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. మద్దూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ అమలు చేయకుండా, మున్సిపల్ ఎన్నికల్లో కేవలం 17 శాతం మాత్రమే అమలు చేసి బీసీలను మోసం చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు గణేష్, వెంకటప్ప, చిన్నయ్య, లాలప్ప, మొగులప్ప, భాస్కర్ పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గ్రామ మహిళా సమాఖ్య భవనానికి గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామ మహిళా సమాఖ్య భవనం పూర్తి చేస్తే మహిళా సంఘాల సభ్యులకు ఎంతో సౌకర్యం ఉంటుందని గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు అన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులుతో పాటు పంచాయతీ రాజ్ ఎఇ మహేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని కోసం స్థలాన్ని సేకరించారు.

## పేటలో 24 వార్డులకు 96 మంది అభ్యర్థులు పోటీ

**నారాయణపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థిత్వ ఉపసంహరణ గడువు ముగియడంతో తుది పోటీదారుల జాబితా ఖరారైంది. మొత్తం 24 వార్డులకు 96 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు అధికారిక నివేదిక వెల్లడించింది. పార్టీవారీగా చూస్తే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి 24 మంది, కాంగ్రెస్ నుంచి 22 మంది, ఏఐఎంఐఎం నుంచి 2 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన గుర్తింపు పొందిన రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల నుంచి 3 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, స్వతంత్రులుగా 21 మంది నామినేషన్లు దాఖలు చేసి తుది జాబితాలో నిలిచారు. ఏ ఇతర పార్టీల నుంచి ఈ మున్సిపాలిటీలో ఎటువంటి అభ్యర్థులు లేరని నివేదికలో పేర్కొన్నారు. ఈ సారి పేట మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉండే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషకులు చెప్తున్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

**పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించిన బిఆర్ఎస్ శ్రేణులు**


రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

**బాలానగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు జడ్చర్లలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బాలానగర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సభావత్ రమేష్ నాయక్ లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదానం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. తన అభిమాన నాయకుడి పుట్టినరోజున ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమన్యు రెడ్డి, మాజీ ఎస్టి సెల్ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఎంశ్రీ పాఠశాలను సందర్శించిన తనిఖీ బృందం


ఉప్పునుంతల హైస్కూల్‌లో తనిఖీ బృందం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉప్పునుంతల పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాప్రమాణాల పరిశీలన, ఉపాధ్యాయుల బోధన పద్ధతులను, అకాడమిక్ క్యాలెండర్ అమలు, విద్యార్థుల యొక్క క్రీడా సామర్థ్యాలను తరగతుల వారీగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను నిశితంగా పరిశీలించారు. ఈ ప్యానల్ ఇన్స్పెక్షన్‌లో బృందం సభ్యులు ప్రతి తరగతి గదిని సందర్శించి ఉపాధ్యాయుల లెవెల్ ప్లాన్స్, విద్యార్థుల నోట్‌బుక్స్, రికార్డులు, మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. పీఎంశ్రీపథకం కింద పాఠశాలలో అమలుచేస్తున్న నూతన విద్యావిధానాలు, డిజిటల్‌బోధన, ల్యాబ్ సౌకర్యాల వినియోగంపై బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా ప్రమాణాలను పాటిస్తూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. తరగతుల వారీగా విద్యార్థుల యొక్క విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు బోధనలో తీసుకోవాల్సిన నూతన మెలకువల పై తనిఖీ బృందం పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం, పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోఅంతర్జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆధ్వర్యంలో చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జరిగింది. సదస్సుకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె.లక్ష్మీ మ్రపతి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీపీ కె సురేష్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం, మద్యపానం, ధూమపానం క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని సూచించారు. లక్ష్మీ మ్రపతి గౌడ్ మాట్లాడుతూ స్క్రీనింగ్ పరీక్షలు ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని వివరించారు. సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ వంటి చికిత్సా విధానాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అతిథులు విద్యార్థులకు ఆరోగ్య అవగాహనతో పాటు సంబంధిత చట్టాలపై కూడా సమాచారం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వసంత మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు యూరియా

**మండల వ్యవసాయ అధికారి రమేష్**


ఉప్పునుంతల సహకార సంఘం వద్ద యాప్ బుకింగ్ పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఓ రమేష్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రైతులు ఇకనుంచి యాప్ బుకింగ్ ద్వారానే యూరియా సరఫరా అవుతుందని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు యాప్ బుకింగ్ పట్ల అవగాహన కల్పిస్తూ, యూరియా కోసం బుకింగ్ చేసుకున్న రైతులకు యూరియా సరఫరా చేశారు. ఈ యాప్ బుకింగ్ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అవగాహన కల్పించారు. గతంలో యూరియా కోసం క్యూ లైన్ లో నిలబడి యూరియా కోసం పడి గాపులు కాయాల్సి వస్తుందని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలులో తీసుకొచ్చిన యాప్ బుకింగ్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన వివరించారు.

## ఏకలవ్యలో గ్రూప్-1 అధికారుల శిక్షణ శిబిరం


శిక్షణ కార్యక్రమంలో గ్రూప్-1 అధికారులు

**వెల్దండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో డాఎంసిఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర గ్రూప్-1 అధికారుల కోసం నిర్వహించబడుతున్న సమ్మిళిత ఫౌండేషన్ కోర్స్ లో భాగంగా, అధికార శిక్షణార్థులను రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుబంధంగా పంపించే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 02 ఫిబ్రవరి 2026 నుండి 05 ఫిబ్రవరి 2026 వరకు అధికార శిక్షణార్థులు వివిధ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అనుబంధంగా ఉన్నారు. ప్రతి పాఠశాలకు 10 మంది అధికార శిక్షణార్థులు 2 రోజుల కాలానికి అనుబంధంగా పాల్గొన్నారు. ఈ క్రమంలో ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల, రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్ వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రూప్-1 అధికారులు అయిన డిప్యూటీ కలెక్టర్లు మరియు డీఎస్పీలు పాల్గొని విద్యా వ్యవస్థ, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సమస్యలు, పాలనా విధానాలపై అవగాహన పొందారని వారు పేర్కొన్నారు. ఈ శిబిరం ద్వారా అధికారులకు క్షేత్రస్థాయి అనుభవం లభించిందని తెలిపారు.

# వెల్లువెత్తిన అభిమానం..

**వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, లక్ష్మారెడ్డి అభిమానులు**

**ఘనంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు**

**1296 మంది స్వచ్ఛందంగా రక్తదానం**

**క్రేజ్ తగ్గని లీడర్..**

**ఫోటోలు దిగేందుకు గంటల తరబడి క్యూ లైన్**


మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదానం చేస్తున్న అభిమానులు, కార్యకర్తలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా జడ్చర్ల పట్టణం అంతా గులాబీ మయం అయింది. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు లక్ష్మారెడ్డి అభిమానులు వేలాదిగా తరలి రావడంతో పట్టణం అంతా సందడిగా మారింది. ఉదయం జడ్చర్ల కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ నుంచి ప్రేమ్ రంగా గార్డెన్ వరకు భారీ ఎత్తున ర్యాలీగా తరలివచ్చారు. జై లక్ష్మారెడ్డి..జై లక్ష్మన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**1296 మంది రక్తదానం..**

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా నాయకులు కార్యకర్తలు ఆయన అభిమానులు వేలాదిగా తరలి వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు జడ్చర్ల పట్టణంలోని ప్రతి వార్డు నుంచి పార్టీషన్లు తరలివచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ గవర్నమెంట్ హాస్పిటల్, షాద్నగర్ ప్రభుత్వ దవాఖానతో పాటు మహబూబ్‌నగర్ బ్లడ్ బ్యాంకు వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 1296 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానంతో ఒకరికి ప్రాణదానం చేయడమే కాదు లక్ష్మారెడ్డి పై తమకున్న అభిమానాన్ని ఈ విధంగా చాటుకున్నారు.

**క్రేజ్ తగ్గని లీడర్ ...**

అధికారంలో ఉన్న లేకున్నా ఆయనకు ప్రజల్లో మాత్రం ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. అందుకు నిదర్శనమే మంగళవారం జడ్చర్ల ప్రేమ్ రంగ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకలు. లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం వార్డు పల్లె నుంచి వేలాదిగా ఆయన అభిమానులు పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఆయనతో ఫోటో దిగేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. వందలాదిగా రక్తదానం చేసేందుకు కూడా యువత స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఏ ఒక్కరిని కూడా నిరుత్సాహపరచకుండా ప్రతి ఒక్కరితో ఫోటోలు దిగుతూ ఆప్యాయంగా వారిని పలకరిస్తూ లక్ష్మారెడ్డి పరి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. జడ్చర్ల పట్టణం నుంచి కాకుండా గ్రామాల నుంచి ఆయన అభిమానులు పెద్ద ఎత్తున గజమాలలు పూలదండలు బొకేలు శాలువాలతో లక్ష్మారెడ్డిని సన్మానించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జడ్చర్లకు చేరుకొని లక్ష్మారెడ్డి ప్రశంసా పత్రంతో పాటు సర్టిఫికెట్ ను అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి తనయుడు స్వరణ్ రెడ్డి, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్ రెడ్డి, నందకిషోర్ గౌడ్, ఉమాశంకర్ గౌడ్, పాలాది సారిక, చైతన్య, ఆలూరి శశికిరణ్, రఘురాం గౌడ్, సతీష్, బుక్క మహేష్, శ్రీశైలమ్మ, దేవా, నాయకులు నాయకులు కోడుగల్ యాదయ్య, పిట్టల మురళి, ప్రనిల్ చందర్, భూపతిరెడ్డి, పాలాది రామ్మోహన్, శ్రీశైలం యాదవ్, నాగిరెడ్డి, శంకర్ నాయక్, ఇంతియాజ్ ఖాన్, అమీర్, టైగర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మారెడ్డి అభిమానులు, కార్యకర్తలు, పార్టీ నాయకులు

# ఇల్లు నిర్మించుకోండి.. బిల్లులు చెల్లిస్తాం

**బిల్లులు చెల్లింపులలో అపోహలు వద్దు**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెరగాలి**

**హౌసింగ్ పీడీ వెంకట ఉపేందర్ రెడ్డి**


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ పీడీ వెంకట ఉపేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయని అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మండలంలో 499 ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడత కింద మంజూరు కాగా వాటిలో 56 ఇండ్ల లబ్ధిదారులు తమకు ఇందిరమ్మ ఇల్లు వద్దు అంటూ దరఖాస్తు చేసుకోగా వాటి స్థానంలో 36 మందికి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు 50 కొనసాగుతున్నాయన్నారు. ఈ ఇండ్ల నిర్మాణంలో మార్కౌట్, బేస్మెంట్, లెంటల్ లెవెల్, స్లాబ్, ఫినిషింగ్ దశలవారీగా పనులు జరుగుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను అధికారుల పరిశీలన పూర్తయిన వెంటనే బిల్లులు లబ్ధిదారుని ఖాతాలో జమవుతాయన్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు బిల్లులు రావని అపోహలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ వేధింపులు ఉండవని నిజంగా ఇల్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎవరైతే ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులకు వద్దకు అధికారులు వెళ్లి వాళ్ళ అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. ఎవరైతే మేము ఇల్లు నిర్మించుకోలేము అధికారుల ముందు తెలిపితే వాటి స్థానంలో ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వికసిత్ భారత్ జి రామ్ జి పథకం కింద 90 రోజుల పనికి గాను రూ. 27వేలు లబ్ధిదారుని ఖాతాలో జమవుతాయని ప్రతి లబ్ధిదారులు జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఎవరైతే జాబ్ కార్డు లేకపోతే సంబంధిత అధికారులను సంప్రదించి జాబ్ కార్డు కై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులు ప్రతి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులను కలవాలని ఆయన ఆదేశించారు. ఎదలాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పుష్పలత, ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ సెలక్షన్స్ ప్రారంభం


సీఎం కప్ టోర్నమెంట్ అండ్ సెలెక్షన్స్ ప్రారంభించిన నందిన్నె సర్పంచ్

**కెటిదొడ్డి ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందిన్నె గ్రామం "జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల" మైదానంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ అండ్ సెలెక్షన్స్ ప్రారంభించిన నందిన్నె సర్పంచ్ బోయ నాగమ్మ,,ఎంపీడీవో రమణారావు, మండల విద్యాధికారి విజయ్ భాస్కర్ మండలంలోని వివిధ గ్రామాల "100 నుంచి 150" మంది క్రీడాకారులు టోర్నమెంట్లో పాల్గొన్నారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ బోయ నాగమ్మ,...మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చేపట్టి న సెకండ్ ఎడిషన్ సీఎం కప్పు202526 పల్లె నుంచి ప్రపంచ స్థాయికి విజేతలను వెలుగు తీసే కార్యక్రమంలో అందరూ యువతి యువకులు పాల్గొని మీ యొక్క ప్రతిభను కనబరచాలని మండల స్థాయి నుంచి జాతీయ ప్రపంచ స్థాయిలో వెలగాలని అన్నారు. అలాగే క్రీడలు ఆరోగ్యాన్ని ఇస్తాయని అన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులకు సర్పంచ్ బోయ నాగమ్మ భోజన వసతి ఏర్పాటు చేశారు. క్రీడాకారులు సీఎం కప్ టోర్నమెంటు మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి రాష్ట్రస్థాయికి జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సూచించారు. క్రమశిక్షణతో ఆటలను ప్రాక్టీస్ చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు సీఎం కప్ యొక్క ముఖ్య ఉద్దేశము గ్రామ స్థాయి లో ఉన్న క్రీడాకారులను వెలికి తీసి జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే ఈ క్రీడ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయ నాగమ్మ, ఉపసర్పంచ్ పుష్పతాయిరెడ్డి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి రమణారావు, మండల విద్యాధికారి విజయ్ భాస్కర్, వార్డు సభ్యులు, ఎపిఒ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, సుధాకర్, చిన్న నాగేష్, పి టి అమరేష్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కేసులకు భయపడం

**మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి**


మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి

**మాగనూర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** అక్రమ కేసులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడరని పార్టీ మాగనూర్ మండల అధ్యక్షులు ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం రాష్ట్ర మాజీముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు సిట్ విచారణలో భాగంగా రాష్ట్రపార్టీ పిలుపుమేరకు ఉమ్మడి మాగనూర్ మండలం టైరోడ్ దగ్గర శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమన్వయం పాటించకుండా పోలీసులు సీఎం దిష్టిబొమ్మను లాక్కోవడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన ఉద్రిక్తతకు దారి తీసినట్లు తెలిపారు. సీఐ అత్యుత్సాహం తోనే మాజీ ఎమ్మెల్యే రోడ్డుపై పడుకుని నిరసన తెలిపినట్టు తెలిపారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తే కేసులు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయంలో సీఎం దిష్టిబొమ్మలను చాలాసార్లు దహనం చేసిన కేసులు పెట్టకుండా ప్రజాస్వామ్య హక్కులను కాపాడినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం కక్షపూరితంగానే కేసులునమోదు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా బనాయించిన కేసులను తక్షణమే ఉపసంహరించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు అశోక్ గౌడ్, ముష్టి రాము, మహమ్మద్, నారాయణ, సాయిబన్నతో పాటు తదితరులు ఉన్నారు.

## సకాలంలో డీలర్లకు సరుకులు సరఫరా చేయాలి


సమస్యలు తెలుసుకుంటున్న సివిల్ సప్లై డిఎం

**బిజినేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** డీలర్లకు సరుకులు పంపిణీ చేసే ముందు తూకాలు వేసి ఇవ్వాలని జిల్లాపౌర సరఫరాల శాఖ డీఎం రాజేందర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పౌరసరఫరాల బియ్యం గోదాంను మంగళవారం సివిల్ సప్లై డిఎం ఆకస్మిక తనిఖీ చేశారు. సకాలంలో డీలర్లకు సరుకులు సరఫరా చేయాలని ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనపథకంకింద ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. మిల్లర్ల నుంచి గోదాంకు వచ్చిన బియ్యం వివరాలు, రేషన్ దుకాణాలకు సరఫరా చేసిన బియ్యం వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. ప్రతినెల రికార్డుల రీకన్సిలేషన్ తప్పకుండా చేయించాలని సూచించారు. తరుగు లేకుండా వంద శాతం తూకంతో సమయానికి సరుకులను రేషన్ షాపులకు సరఫరా చేయాలని గోదాం ఇంఛార్జి మురళిని అదేశం చారు. అలాగే హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## విద్యుత్ సమస్యలపై అధికారుల ప్రజాబాట


ప్రజాబాటలో విద్యుత్ అధికారులు

**నవాబుపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై మండల విద్యుత్ అధికారులు మంగళవారం మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. అధికారులు గ్రామంలో పర్యటించి విద్యుత్ సరఫరా, మీటర్ సమస్యలు, బిల్లులపై వస్తున్న ఫిర్యాదులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొత్త కనెక్షన్లు, లోడ్ పెంపుపై అందిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ భీమ, డిఈ చంద్రమౌళి, అసిస్టెంట్ డిఈ నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ రవలీల, మాజీ సర్పంచ్ అంతయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత


టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

**కృష్ణ, ఫిబ్రవరి3 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను ఎస్ఐ ఎస్ ఎం నవీద్ పట్టుకున్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని హిందూపూర్ గ్రామంలో జాతీయ రహదారిపై రాయచూరు నుంచి అనుమానాస్పదంగా వస్తున్న టిప్పర్ ను ఆపి తనిఖీ చేయగా దానిలో ఇసుక ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో విచారణ చేయగా కర్ణాటక రాష్ట్రం మాన్వి నుంచి బీదర్‌కు మహేశ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బీదర్‌కు చెందిన టిప్పర్ ఓనర్ నాగనాథ్ ఆదేశాల మేరకు ఇసుక తరలిం చినట్లు డ్రైవర్ ఒప్పుకోగా టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎం నవీద్ తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసి గ్రూప్ ఏర్పాటు చేయాలి


హెచ్ఈసీ గ్రూపును ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గోపాలరావుకు హెచ్ఈసి గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థి నాయకులు సంతోష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ బైపీసీ, సీఈసీ, గ్రూపులతో పాటు నూతనంగా హెచ్ఈసిగ్రూపును ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, కార్తీక్, సాయిచరణ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్లు


పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిఆర్‌యస్ నాయకులు

**గద్వాల ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని 24వ వార్డు కు చెందిన మాజీ కౌన్సిలర్ అన్వర్, గువ్వల గోపాల్, వెల్డింగ్ షాప్ ముక్బాల్, ఎండి సిపిఎం, ఆజాద్ తదితరులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ ఆంజనేయ గౌడ్, బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, పటేల్ జనార్దన్ రెడ్డి, యూసఫ్, మోనేష్, శ్రీరాములు, ఎండి మాజ్, హరి, ముని మోర్య, చాకలి శ్రీనివాసులు, రవి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ బరిలో 65 మంది అభ్యర్థుల ముగిసిన ఉపసంహరణల పర్వం



మక్తల్ మున్సిపల్ కార్యాలయం

**మక్తల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీలో మొత్తం 65 మంది బరిలో ఉన్నట్లు కమిషనర్ శ్రీరామ్ తెలిపారు. మంగళవారం మూడు గంటల వరకు 83 మంది అభ్యర్థుల నామినేషన్లు ఒకే చేశారు. గడువుముగిసే సమయానికి 18మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 65 మంది అభ్యర్థులు సమరానికి సై అన్నారు. ఆల్ఫాబెటిక్ ఆర్డర్ ప్రకారంగా గుర్తులను అభ్యర్థులకు కేటాయించారు. బిజెపి పార్టీ అభ్యర్థులు 14, బీఎస్పీ08, కాంగ్రెస్16, ఎంఐఎం03, బిఆర్ఎస్ 14, జేఎస్పీ 03, స్వతంత్ర అభ్యర్థులు 07 మంది పోటీలో ఉన్నారు.

# రెండవ రాండమైజేషన్ పూర్తి

- 82 వార్డులకు 320 పోలింగ్ స్టేషన్లు
- 1992 మంది పోలింగ్ సిబ్బంది కేటాయింపు
- మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి, కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి3 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌సిబ్బంది కేటాయింపులో భాగంగా రెండవ రాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయేందిర బోయి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా లోని మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, భూత్పూర్, దేవరకద్ర మున్సి పాలిటీల పరిధిలోనిఅన్నిపోలింగ్ స్టేషన్లకు అవసరమైన పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని మున్సిపాలిటీ లలోమొత్తం 82 వార్డులు, 320 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 20 శాతం రిజర్వుతో కలిపి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పిఓ, ఒక ఏపిఓ, ఇతర పిఓ ల చొప్పున మొత్తం 1922మంది పోలింగ్ సిబ్బందినిరెండవ రాండమైజేషన్ ద్వారా కేటాయించి నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు రాండమైజేషన్ విధానం అత్యంత కీలకమని అన్నారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి ఆర్‌డిఓ నవీన్ హాజరయ్యారు.

# ఎన్నికల నియమావళి పాటించాలి

- శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ బందోబస్తు
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి
- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నామినేషన్ ఉపసంహరణ, బీ-ఫారం సమర్పణ ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా, మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా విధుల నిర్వహణపై పోలీసు అధికారుల కు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ ఉపసంహరణ బీ-ఫారం సమర్పణ ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహిం చాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థులు, వారి అనుచరులు, ప్రజలు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నామినే షన్ ఉపసంహరణ, బీ-ఫారం సమర్పణకు చివరి రోజు కావడంతో, ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టి నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భనలో వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఆపరేషన్ స్మైల్‌లో విశేష సేవలు..

స్టేక్‌హోల్డర్లకు ప్రశంసాపత్రాలు అందజేత

అభినందించిన మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి







ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 2026 కార్యక్రమంలో భాగంగా, గత నెల జనవరి 1 నుండి 31 వరకు మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా బాల కార్మికత్వ నిర్మూలన కోసం సమన్వయంతో కృషి చేసిన వివిధ శాఖల సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. జానకి మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రశంసాపత్రాలుఅందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లా డుతూ బాల కార్మికత్వం సమాజానికి ముప్పుగా మారుతున్న తరుణం లో, పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖలు, సంస్థలు కలిసి పనిచేయడం అత్యంత అవసరమని అన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం విజయవంతంకావడంలో పోలీస్ సిబ్బం ది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి) సిబ్బంది, లేబర్ సిబ్బంది, డిసిపి యు (డిసిపియు) సిబ్బంది, ఎన్జీవోలు, ఆశ్ర సిబ్బంది సమిష్టిగా బృందాలుగా ఏర్పడి చురుకుగా పనిచేశారని ప్రశంసించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషి వల్లే బాల కార్మికత్వ నిర్మూలన దిశగా సానుకూల ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సమన్వయం కొనసాగించాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ దిశగా పోలీస్ శాఖ ఎప్పటికీ ముందుంటుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని ఈ సందర్భంగా జిల్లాఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన అన్ని శాఖల సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియ జేశారు. ఈ క్రమంలో వుమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సిడబ్ల్యుసి ఛైర్మన్ నయీముద్దీన్, ఆపరేషన్ స్మైల్ సబ్ ఇన్స్పెక్టర్ రామ్‌లాల్, లేబర్ అధికారి అల్తాఫ్, ఆశ్రసిబ్బంది, ఎన్జీవోస్ , డిసిపియు సిబ్బంది ఏహెచ్‌టియు సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



బి ఫాం అందుకుంటున్న అభ్యర్థి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ప్రజలు ప్రతిపక్షాలు నమ్మే పరిస్థితిలో లేరని, గత పదేళ్ల కాలంలో కేవలం ప్రతిపక్ష నాయకులే బాగు పడ్డారు తప్ప ప్రజలు కాదని, నేటి ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అందుతున్నాయని ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కొత్త కాపు శివసేనారెడ్డి, చిన్నారెడ్డి, మేఘా రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీఫాములను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరఫున బీ ఫాంలు పొందిన ప్రతి కౌన్సిలర్ అభ్యర్థులందరినీ గెలిపించి తీరుతామని మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనరెడ్డితో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థు లకు ఆయన బీఫాంలు అందజేశారు.

## పుర పోరులో ప్రచారాల జోరు

(మొదటి పేజీ తరువాయి)





యత్నాల్లో ఉన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో వార్డులను అన్ని విధాలా అభి వృద్ధి చేయగలిగే వారినే కౌన్సిలర్ గా ఎన్నుకోవాలనే పట్టుదలతో ఓటర్లు ఉన్నారు. మునిసి పల్ ఎన్నికల్లో పార్టీల టికెట్ మీదనే అభ్యర్థులు పోటీ చేస్తుండగా, అభ్య ర్థుల వ్యక్తిగత చరిత్ర ఆధా రంగానే ఎక్కువ ఓట్లు పోల య్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఓటర్లు ఒకటికి రెండుసార్లు ఆలోచించి మరీపట్టంగట్టే అవకాశాలుఅధికంగా ఉన్నాయి. అభ్యర్థుల పూర్వ పు చరిత్ర, స్థానిక సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి, అభివృద్ధి చేయాలనే ధృడసంకల్పం ఉన్న వారికే ప్రాధాన్యం ఇచ్చేందుకు ఓటర్లు సిద్ధపడుతున్నారు. ఓటర్లలో విద్యావంతులైన యువత అధికంగా ఉండటంతో తమవార్డులనుఅన్నివిధాలా అభివృద్ధిపయనంలో నడిపించేం దుకు సరైన అభ్యర్థినే ఎన్నుకోవాలనే నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్
- కార్పొరేషన్ అభ్యర్థులకు బీఫామ్ అందజేత



కార్పొరేషన్ అభ్యర్థులకు బిఫామ్ అందజేస్తున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధిని ఇంటింటా వివరించాలని, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో వైఫల్యాలను ఎండగట్టాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ సూచించారు. భారత రాష్ట్ర సమితి క్యాంపు కార్యాలయంలో మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థులకు బి ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవతలి పార్టీ బెదిరింపులు, కవ్వింపులకు భయపడవద్దని, అన్నింటికీ తానున్నానని, అన్నీ తానే చూసుకుంటానని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మన సర్కారే వస్తదని ధీమా వ్యక్తంచేశారు. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని, అందుకు అంతా కలిసి శ్రమించాలని సూచించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పి మున్సిపల్ ఏన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వెంట నిలబడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, 12 ఏండ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయకుండా టైంపాస్ చేస్తున్నాయని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు. మహబూబ్ నగర్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందింది. పూర్తి చేయకుండా ఎక్కడికక్కడ పనులు నిలిపివేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులతో రోడ్లు మురుగు కాలువలు కడుతున్నారు. కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నర్సింహులు, డీసీసీబీ మాజీ వైస్ ఛైర్మన్ వెంకటయ్య, పట్టణ అధ్యక్షులు శివరాజ్ , మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ ఆంజనేయులు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన పులగూరి అనసూయ భర్త పులగూరి మద్దిలేటి గత కొన్ని రోజులుగా అనారోగ్య పరిస్థితుల కారణంగా హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రిలో డయాలసిస్ విభాగంలో ట్రీట్మెంట్ తీసు కుంటున్నారు. వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వీరికి తమ వంతు సహాయంగా ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకొని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రాజకీయ ప్రజా ప్రతినిధులు కాలనీ పెద్దలు ప్రతి ఒక్కరూ వారికి తోచిన విధంగా రూ. 12వేలు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కే.రాజేష్ హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించి వారికి ఆర్థిక సహాయంగా డబ్బులను అందజేయడం జరిగింది. శ్రీరంగాపురం మండలంలో ఎవరికి ఏ ఆపద కలిగిన వారికి అండగా మేమున్నామంటూ ఆర్థిక సహాయం చేస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుండడంతో వారి నుంచి సహాయం పొందుతున్న వాళ్లు గ్రామస్తులు వారికి అభినందనలు తెలియజేస్తూ ముందు ముందు ఇలాంటి కార్యక్రమాలుఎన్నో చేయాలని కోరుకుంటూవారికి అభినందనలు తెలియజేయడం జరిగింది.

# ఇక ప్రచారం షురూ..



**9వ తారీకు సాయంత్రం వరకు మోగనున్న మైకులు**

**18 మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో ఎన్నికల సందడి**

**376 వార్డుల్లో తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్న అభ్యర్థులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నేటి నుంచి ఎన్నికల ప్రచార సందడి మొదలుకానుంది. 18 మున్సిపాలిటీలతోపాటు తొలిసారిగా కార్పోరేషన్‌గా ఏర్పాటైన మహ బూబ్‌నగర్ లో కూడా ఎన్నికలు జరగనున్నాయి. అధికార పార్టీ చైర్మన్ పీఠాలను దక్కించుకోవాలని పావులు కదుపుతుండగా, అందుకు తగ్గట్టు బిఆర్ఎస్ కూడా ఎక్కడికక్కడ అభ్యర్థులను సెట్ చేసుకొని బలంగా బరిలో దిగినట్లు తెలుస్తున్నది. మరోవైపు బిజెపి కూడా ఈసారి ఎలాగైనా మున్సిపాలిటీలను దక్కించుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నది. దీంతో నేటి నుంచి అభ్యర్థులు వార్డులో ఇంటింటి ప్రచారం చేయనున్నారు.

**తలనొప్పిగా రెబెల్స్:** అధికార కాంగ్రెస్ పార్టీకి రెబెల్స్ తలనొప్పిగా మారనున్నట్లు తెలుస్తున్నది. చాలావరకు అభ్యర్థులను ఉపసంహరించే ప్రయత్నాలు చేసినప్పటికీ కొందరు వినకపోవడంతో ఇండిపెండెంట్‌లుగా బరిలో నిలువనున్నారు. అయితే బి ఆర్ ఎస్ కు కూడా ఈ బాధ తప్పలేదు. ఇదిలా ఉండగా అభ్యర్థులు ఎవరు బరిలో ఉన్నా సరే గెలిచాక తమ దారిలోకి తెచ్చుకుందాం అనే ప్రణాళికలతో ఇటు అధికార పార్టీతో పాటు విపక్షాలు కూడా పావులు కదుపుతున్నాయి.

మహబూబ్‌నగర్ మేయర్ పీఠం చర్చనీయాంశం.. తొలిసారిగా కార్పోరేషన్‌గా ఏర్పడిన మహబూబ్ నగర్‌లో తమదే పైచేయి అంటూ కాంగ్రెస్, బిఆర్ఎస్‌లే కాదు..బిజెపి సైతం అందుకు అనుగుణంగా అభ్యర్థులను నిలబెట్టినట్లు సమాచారం. కార్పొరేషన్ లో 30కి పైగా సీట్లు తెచ్చుకుంటామని ఓవైపు మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగానే నేడు భారీ ఎత్తున ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశానికి ఏకంగా బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా రావడం విశేషంగా చెప్పవచ్చు. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠం తమదేనంటూ సీఎం సొంత జిల్లా కావడంతో 50 పైగా కార్పోరేటర్లను గెలిపించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తామని స్వయంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మేయర్ పీఠం తమదేనంటూ మరోవైపు మాజీమంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ చెబుతున్నారు. అయితే మహబూబ్‌నగర్ మేయర్ పీఠం బిసి మహిళకు రిజర్వ్ కావడంతో ఇప్పటివరకు ఏ ఒక్కరికి కూడా పార్టీ నుంచి హామీ రానట్టు తెలిసింది. రిజర్వేషన్ కేటగిరీలో కార్పొరేటర్ గా గెలిచిన అనంతరం మేయర్ పీఠం ఎవరికి ఇస్తారు అనేది నిర్ణయించడం జరుగుతుందని సమాచారం. రేపు నేటినుంచి ప్రారంభం కానున్న ఎన్నికల ప్రచారం ఈనెల తొమ్మిదవ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ముగియనున్నది. 48 గంటల తర్వాత ఈ నెల 11న మున్సి పల్ ఎన్నికల పోలింగ్ జరగనుండగా 13న ఫలితాలు వెలువడనున్నాయి.

## ప్రారంభమైన మండల స్థాయి సీఎం కప్ పోటీలు



మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

**కృష్ణ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి పోటీలను తహసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ నిజముద్దీన్ ప్రారంభించారు. పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నిజాముద్దీన్ మాట్లాడు తూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు శరీర దృఢత్వం మెరుగ వుతుందని అన్నారు. విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొని మన మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయనకోరారు. సర్పంచ్‌నాగేష్, ఉపసర్పంచ్ రేష్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, ఉపాధ్యా యులునాగరాజ్, పిఈటీ సౌమ్య, రవి, సీఆర్పి అమీన్ రెడ్డి క్రీడాకారులు ఉన్నారు.

**లాలింపులు, బుజ్జగింపులు, తాయిలాల అనంతరం..**

## రంగంలో మిగిలిన అభ్యర్థులు వీరే

**భూత్పూర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీలో నామి నేషన్‌ల ఉపసంహరణ అనంతరం రంగంలో 41 మంది మిగిలారు. మున్సిపాలిటీలోని పది వార్డులకు పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను పరిశీలిస్తే ఒకటవ వార్డ్ నుంచి ఐదుగురు పోటీపడుతున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి మాధురి మూడవత్, ఆర్ దేవి(బిఆర్ఎస్), మంగ (బిజెపి), సభావత్ సౌజన్య (స్వతంత్ర), ఎ.సుజాత (స్వతంత్ర), రెండో వార్డ్ నుంచి అనుప సుజాత (బిఆర్ఎస్), నిమ్మల అన్నపూర్ణ (కాంగ్రెస్), సిగురం సంధ్యారాణి (బిజెపి), డేగావత్ శాంతి (స్వతంత్ర), మూడో వార్డ్ నుంచికాట్రావత్ రాము(బిఆర్ఎస్), పాతలావత్ సోమ్లానాయక్ (కాంగ్రెస్), పాలత్యావత్ లాల్య (కాంగ్రెస్), పాత్లావత్ తిరుపతయ్య (టీఆర్పి), కె ముత్తయ్య (స్వతంత్ర), ఐదో వార్డ్ నుంచి కేంద్యాల పద్మ (కాంగ్రెస్), ముష బాలస్వామి (బిఆర్ఎస్), యురాధి మహానంది(బిజెపి), ఆరో వార్డ్ నుంచి గడ్డం రాజు (కాంగ్రెస్), కె మచెందర్ (కాంగ్రెస్), ఎల్ రామకృష్ణ (బి ఆర్ఎస్), కేంద్యాల శ్రీనివాసులు (బిజె పి), ఏడో వార్డ్ నుంచి తీలేటి స్వాతి(బి ఆర్ఎస్), లత సూరన్నగారి (బిజెపి), ఎ శ్రీదేవి (కాంగ్రెస్), ఎనిమిదో వార్డ్ నుంచిఎండి ఫరూక్ (బిజెపి), బాలకోటి ముడావత్ (కాంగ్రెస్), మొహమూద్ అజీజ్ (బిఆర్ఎస్), మల్లికార్జున్ (స్వాతంత్ర), తొమ్మిదో వార్డ్ నుంచి వి చంద్రకళ (కాంగ్రెస్), పాలత్యావత్ మోతి (బిజెపి), సంధ్య లవుడ్యా (బిఆర్ఎస్), పాతలావత్ మణెమ్మ (స్వాతంత్ర), సభావత్ శిరీష (స్వతంత్ర), పదో వార్డ్ నుంచి కడప పద్మజ (బిఆర్ఎస్), దిడ్డిలక్ష్మి (బిజెపి), లిక్కి సూర్యకళ ( కాంగ్రెస్), నాహిద్ బేగం (స్వతంత్ర) మొత్తం 41మంది భూత్పూర్ మున్సిపాలిటీకి కౌన్సిలర్ పదవులకు పోటీ పడుతున్నారు.

## గుర్తుల కేటాయింపులో పొరపాట్లకు తావివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ ఉపసంహరణ, గుర్తుల కేటాయింపుపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు స్వయంగా హాజరై ఉపసంహరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతినిధి లేదా ఏజెంట్ ద్వారా ఉపసంహరణ పత్రాలు అందజేసిన సందర్భంలో తప్పనిసరిగా సంబంధిత అభ్యర్థికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవడంతో పాటు పత్రాలపై ఉన్న సంతకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులకు ఆదేశించారు. ఈసందర్భంగా జాతీయరాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల అధికారిక బీఫారమ్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆయా పార్టీలు మొదటగా వెల్లడించిన ఫారం-ఏ ఆధారంగానే బీఫారమ్‌లు సమర్పించబడ్డాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలవరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, ఎన్ని కల విధులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వ హించాలని ఈసందర్భంగా జిల్లా కలెక్టర్‌బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డీవో సురేష్, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నాగర్‌కర్నూల్ తహసిల్దార్ తబితా రాణి, వివిధ వార్డులకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

## రంగంలోకి రెబల్స్..?



బి ఫామ్‌లు సమర్పించి బయటకు వస్తున్న డిసిసి అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

దీంతోకొన్ని వార్డుల్లో కాంగ్రెస్ రెబల్స్ బడిలో ఉంటున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ టిక్కెట్లు రావని తెలిసి ఇప్పటికే సరిత వర్గం నుండి గెలిచే అభ్య ర్థులు పులిపాటి వెంకటేష్, డి.టీ.డి.సి. నరసింహ, భాస్కర్ యాదవ్, టి.ఎన్.ఆర్. జగదీశ్‌లు బిఆర్‌యస్ పార్టీ నుండి బరిలో దిగారు. ఇప్పుడు మరో 7మంది కాంగ్రెస్ టిక్కెట్టు ఆశించి ఉన్నవారు బరిలో ఉన్నారు. ఈ ఏడుగురికి వారి వారి వార్డులలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన వారు కాంగ్రెస్ బి ఫామ్‌లతో నామినేషన్ దాఖలు చేశారు. ఒకే వార్డులో బి ఫామ్ అభ్యర్తి, బిఫామ్ లేని అభ్యర్తి పోటీలో ఉన్నట్లు తెలుస్తుంది. ఎన్నికల రోజు వరకువీరు ఇలాగే కొనసాగుతారా బుజ్జగింపులకు లోనవు తారా చూడాల్సి వుంది. ఇరు వర్గాలు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లయితే కాంగ్రెస్‌కు రెబల్స్‌గా తప్పదని తెలుస్తుంది.

## ఏదుట్ల శ్రీను మరణం చాలా బాధాకరం

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఏదుట్ల శ్రీను సోమవారం తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ పనులు చేస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి శ్రీను ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. విషయం తెలుసుకున్న వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి మంగళవారం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏదుట్ల శ్రీనుమృతి దేహాన్ని చూసి కుటుంబ సభ్యు లను పరామర్శించారు. ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి మాట్లాడుతూ ఏదుట్ల శ్రీను మరణం చాలా బాధాకరం అని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. వీరితో పాటు టిపిసిసి బీసీ విభాగం ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌యాదవ్, శ్రీరంగాపూర్ సర్పంచ్ మద్దిలేటి, ఎస్సై హిమబిందు ముఖ్య నాయకులు ఉన్నారు.



ఆసుపత్రి మార్చురీలో శ్రీను మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే